
# నీడ లేని నిజం

నందిగం కృష్ణారావు

అస్తమిస్తున్న సూర్యుడ్ని కలవడానికి చితిమంటలు ఎగిసిపడుతున్నాయి. కాలుతున్న చితిచుట్టూ, చలి కాచుకొంటున్నట్లుగా కొందరు బిగుసుకుపోయి వున్నారు. ఆ కొందర్లో పోలీసులూ, మఫ్టీ కానిస్టేబుళ్ళు కూడా వున్నారు. మేధావులూ, పెద్ద మనుషులూ, మానవ హక్కుల కోసం పాటుపడుతున్నవాళ్ళూ ఉన్నారు. "ఎవరు సార్? అతను కాలిపోతున్నది" అని అడిగాడు జుట్టు రేగిపోయి, బట్టలు మాసిపోయి, దవడలు డొక్కుపోయి మాసిన గెడ్డంతో వున్న ఒకతను.

అతన్ని చూసినవాళ్ళంతా ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. అది చూసి ఆ చచ్చిపోయి, కాలిపోయి బూడిదవుతున్న మనిషికీ, తనకీ ఏదైనా సంబంధం ఉందేమోనని భయపడ్డాడతను. ఎవరు? ఎవరు? ఎవరై వుంటారు? అన్న ప్రశ్నలు అతన్ని తొలిచేస్తుండగా, "ఎరిగున్న వాళ్ళందర్నీ పట్టుకొని నన్ను గుర్తు పట్టలేదా? నేను నేను... సత్యాన్ని, ఆ మనిషెవరో చెప్పరూ?" బ్రతిమాలాడు.

కథ



ఒకరొక నిట్టూర్పు విడిచి వూరుకొన్నారు. అతని కళ్ళల్లో భయమూ, దైన్యం కలిసి గూడు కట్టుకొన్నాయి.

"రమేష్ నేను... నేనే సత్యనారాయణ, సత్యాన్ని" అన్నాడతను రమేష్‌ని పట్టుకొని వూపేస్తూ.

"ప్చ్... అంతా అయిపోయింది" గడ్డం నిమురుకొన్నాడు రమేష్.

అతని ప్రాణాలు హరించుకుపోయాయి. రకరకాలుగా ఊహించుకొని భయపడ్డాడు. "అసలింతకీ ఏమైంది? ఆ చనిపోయిందెవరూ? మీరంతా యిక్కడెందుకున్నారు?" అని అడుగుతూ అందర్నీ నిలేశాడు.

అక్కడున్న డిఎస్‌పి షబీర్ అతనికేసి పళ్ళు కొరుకుతూ, కోపంగా చూశాడు.

సందేహం లేదు. ఏదో ఉపద్రవం ఊర్ని దుఃఖంలో ముంచేసింది. లేకపోతే ఊరు వల్లకాడైనట్లు వీళ్ళంతా స్మశానంలో ఎందుకుంటారు.

అంతా డియస్‌పి షబీర్‌కేసి భయం భయంగా చూసారు.

"భయపడకండి మీరు. పోలీసుల్ని నిలేద్దాం. జరిగిందేమిటో చెప్పండి" అడిగాడతను.

నిర్లిప్తంగా ఒకర్నొకరు చూసుకున్నారు. అతనికేసి జాలిగా చూశారు.

"నాకు జాలన్నా, సానుభూతన్నా అసహ్యం అని తెలుసుగదా మీకు. ఎందుకలా చూస్తున్నారు" చిరాకుపడ్డాడు అతను. అతనికి సంబంధించి కాలం పది రోజుల క్రితం ఆగిపోయింది ఆ రోజు అర్ధరాత్రి అతను గాఢనిద్రలో ఉండగా తలుపు చప్పుడైంది."ఎవరూ" అంటూ లేచాడతను. అవతలనించి ఎలాంటి సమాధానం లేదు.

తలుపు దబదబా బాదుతున్నారు. వీధిలో ఆ చప్పుడు, కుక్కల అరుపులు తప్ప ఎలాంటి శబ్దం లేదు. ఎవరో కుక్కలకి భయపడి తలుపులు బాదుతున్నారనుకొన్నాడతను. "భయపడకండి ఆ కుక్కలేమీ చెయ్యవు. అరిచే కుక్కలు కరవవు అన్న సంగతి నీకు తెల్సు కదా" అన్నాడు. అయినా అవతల తలుపు తడుతున్నవాళ్ళు మానలేదు. లైట్ ఆన్ చేసి చొక్కా వేసుకొన్నాడతను.

"ఎవరో తెల్సుకొందే తొందరపడి తలుపు తియ్యకండి" అంది అతని భార్య కళ్ళు చిట్లిస్తూ. ఆమెకెందుకనో యీ మధ్యన భయంగా వుంది, తన భర్త ఎక్కడ డాక్టర్ రామనాథంలా, జాపా లక్ష్మారెడ్డి, నర్రా ప్రభాకరరెడ్డిలా అయిపోతాడేమోనని. మనిషికి స్వచ్ఛమైన గాలి పీల్చుకొనే హక్కు, మాట్లాడే స్వేచ్ఛ, కడుపునిండా తినే హక్కు, అన్యాయాన్ని ఎదిరించే హక్కు, జీవించే హక్కు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని గూర్చి అతనెప్పుడూ కలలు గనేవాడు.

యివన్నీ లేనంతవరకూ మనిషిక్కానీ, దేశానిక్కానీ స్వాతంత్ర్యం వచ్చినట్టు కాదనేవాడతను.

నిజమైన స్వేచ్ఛకోసం, స్వాతంత్ర్యంకోసం మనం ఫైట్ చెయ్యాలనేవాడు.

ఊళ్ళో ఎక్కడ ఏ గొడవైనా అక్కడికి వెళ్ళిపోయి, అన్యాయమైపోయినవాళ్ళ పక్షం వహించేవాడు. అలాగ ప్రభుత్వాన్నీ, పోలీసు దాష్టికాన్నీ, అధికార్ల అఘాయిత్యాల్ని ఎదిరించినవాళ్ళ పనేమైందో ఆమెకి తెలుసు. పైపెచ్చు యీ మధ్యన అనానమస్ కాల్స్ ఏవో వస్తున్నాయి. "నీ మొగుణ్ణి ఒళ్ళు దగ్గర పెట్టుకొని ఉండమను, కాదంటే మీకు చిప్ప కూడే" నని ఒకడు, "ఆ లం... కొడుకు వాణ్ణి గురించి వాడేమనుకొంటున్నాడు. తల ఎత్తకుండా చేస్తామని చెప్పు" అని మరొకడూ హెచ్చరించాడు.

భయంతో ఒణుకుతూ, "ఆయన ఎవరికీ హాని చేసేవాడు కాదు. దయచేసి ఆయన్ని ఏమీ అనకండి" అని వేడుకొంది ఆమె ఏడుస్తూ.

ఏమీ అనం. వాడి శవాన్ని చూసి వాడే భయపడేలా చేస్తాం. "లం...కొడుకు వాడ్ని గూర్చి వాడేమనుకొంటున్నాడు..." అని వికటంగా నవ్వారు అవతల్నించి.

భయంతో ఒళ్ళంతా చెమటలు పోసాయి ఆమెకి. చల్లగా తన గొంతునేదో అదృశ్యశక్తి పట్టుకొని పిసుకుతున్నట్లయింది.

వాడు ఈ ముగ్గురి నీడ కనిపించకుండా వున్నాడు. కానైతే వాడు పట్టుకొన్ని తుపాకి మీద వీధిలైట్ పడటంతో దాని నీడ పొడుగ్గా వాకిట్లో పర్చుకొంది. వాడు కనిపించకుండా తుపాకీ నీడ మాత్రమే కనిపించినందు వల్లా ఆ తుపాకీయే మాట్లాడుతుందే మోననిపించింది. అయినా మనుష లకైతే ఎండా, వానా, చలి కానీ తుపాకులకే చలి, వేడీ, తడి. అది ఎప్పుడు పడితే అప్పుడు ఎక్కడ పడితే అక్కడ యిలాగే పేల్తుంది.

గొంతులోంచి మాట పెగల్లేదు. ఊపిరి పీల్చుకోలేకపోయింది. చేతిలోంచి రిసీవర్ జారి పోయింది.

"హలో... హలో" అని అవతల నించి ఆగంతకులు అంటూనే ఉన్నారు.

"డర్ గయా" అంటూ వికటంగా అన్నాడు ఒకడు అవతల్నించి.

"తో మర్గయి! చచ్చావు. నీలానే నీ భర్తని చంపేసి నీలో ఉంచుకో. లేకపోతే మేం చంపేస్తాం" అన్నాడు మరొకడు అవతల్నించి.

నేల మీద కూలిపోయిన ఆమెకి ఆ మాటలు లీలగా వినిపించాయి. అంటే... అంటే రౌడీల్ని చూసి, దగాకోరుల్ని, పుండాకోరుల్ని చూసి, అధికార్లని, పోలీసుల్ని, పొలిటీషన్లని చూసి భయంతో చచ్చినట్టు ఇంట్లో పెళ్ళాం మీద పెత్తనం చేస్తూ సాయంత్రమవగానే టీవీ ముందు రీవిగా ఉండే విగ్రహంలా ఉండకపోతే తన భర్తని సత్యాన్ని చంపేస్తామనే అర్థం. అలా తన భర్త వుండటానికి వీల్లేదు.

చచ్చినా సరే బ్రతికిపోవాలతను అనుకొని ధైర్యంగా ఫోన్ తీసుకొని "ఏం చేసుకొంటారో చేసుకోండి" అని అరిచి ఫోన్ డిస్కనెక్ట్ చేసింది.

ఆ మర్నాడు ఆ విషయాన్ని పోలీసులకి రిపోర్ట్ చేసింది.

"యిలాంటి అనానమస్ కాల్స్ ట్రెస్ చెయ్యడం కుదరదు. కావాలంటే మీకూ, మీ ఆయనకీ ప్రొటక్షన్ కల్పిస్తాం" అన్నాడు.

అది విని సత్యం నవ్వాడు. "అలా చేస్తే దొంగకి తాళం చెవులు యిచ్చినట్లుంటుంది. పౌరహక్కులవాళ్ళు పోలీసుల పడగ నీడలో ఉంటే, ఆ విషపు గాలికి మానవ హక్కులు మంటగలిసిపోతాయి.


యిహ జనానికి తమ గోడు చెప్పుకోవడానికి ఎవరూ మిగల్రు.

ఒద్దు... ఒద్దు ఆ పని చెయ్యకు" అని బ్రతిమాలాడామెని. ఏమీ చెయ్యలేక ఊరుకొందామె. అప్పట్నించీ చీకట్లో దెయ్యాల్ని, నీడలో మృత్యువునూ, చూస్తోందామె. "ఎందుకైనా మంచిది కొంచెం జాగ్రత్తగా ఉండండి" అని భర్తకి చెప్పింది. భర్త బయటకు వెళ్ళినప్పుడు గంట గంటకీ ఏదో ఒక మిష మీద ఫోన్ చేసి, అతనెక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో తెల్సుకొంటోంది. భయంతో ఆమెలో ఆమెకి అర్థంకాని ఆందోళనేదో ఆమెని కూర్చోనివ్వకుండా, నిల్చోనివ్వకుండా, రెస్ట్‌లెస్‌గా చేసింది. ఉన్నట్టుడి అర్ధరాత్రులు భర్త పక్కన ఉన్నాడో లేదో చూసుకొంటోంది. అతను గాఢనిద్రలో ఉంటే, అతను బ్రతికున్నాడో లేదో తెల్చుకోవడానికి అతన్ని గట్టిగా పిల్చి లేపుతోంది.

"ఏమిటి ఎందుకు లేపావు" అంటే "అదేమిటోనండీ మీ గురించి నాకేదో పీడకల వచ్చింది" అనో,

"ఎప్పుడూ లేంది మీరు యీ మధ్యన గురక పెదుతున్నారు" అనేది.

"భయపడకు నాకేం కాదు" అని భరోసా యిచ్చి ఆమె పడుకొనేంతవరకూ ఏదో పుస్తకం చదువుతూ మేల్కొనేవాడు అతను.



అలాంటిది అర్ధరాత్రి ఎవరూ అంటే పలక్కుండా అవతల ఎవరో అదేపనిగా తలుపులు బాదుతున్నారంటే ఆమెకెందుకో అనుమానం వేసింది. భర్త చెయ్యి పట్టుకొని, అతన్ని అనుసరించింది. "నువ్వు అనవసరంగా భయపడుతున్నావు. జరగాల్సిందేమైనా వుంటే మనం భయపడినంత మాత్రాన ఆగదు" అన్నాడు అనునయంగా.

తీరా తలుపు తియ్యగానే అవతల ముగ్గురు తాటిచెట్టంత మనుషులు నిల్చునున్నారు. అందులో ఒకడికి హార్మణి పెట్టెలాంటి పళ్ళున్నాయి. కానైతే శ్రుతి తప్పిన హార్మణిలా బొంగురు గొంతుతో "సార్ బాగున్నారా" అన్నాడు. సత్యం అతన్నెప్పుడూ చూడలేదు. అర్ధరాత్రి దేవుడొచ్చి నిద్ర లేపి పలకరించినా, ఎవరికైనా చికాగ్గా ఉంటుంది. ఆ వచ్చినవాళ్ళు దేవుళ్ళలా లేరు. రాక్షస గణంలో పుట్టిన మనుషుల్లా ఉన్నారు. "ఎవరండీ మీరు. నే... నెప్పుడూ మిమ్మల్ని చూసినట్లు లేదు" అన్నాడు సత్యం. అతనామాట ఎంత నమ్రతగా అన్నా అతని మొహంలో అసహనం కనిపించింది. గొంతులో చికాకు ధ్వనించింది.

"సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మన్మోహన్‌సింగ్, జార్జిడబ్ల్యు బుష్‌లని మీరెరిగినట్లే మేం మిమ్మల్ని ఎరుగుదం సార్. మీ మీటింగుల్లో మేం అటెండ్ అయ్యాం. మీరు చెప్పిన విషయాల్ని జాగ్రత్తగా ఫాలో అయ్యాం సార్. మీరు మమ్మల్ని ఎరక్కపోవచ్చు కానీ, మేం మిమ్మల్ని బాగా ఎరుగుదుం" అన్నాడు మరొకడు. అతను మంకీ క్యాప్ పెట్టుకొని స్వెటర్ తొడుక్కొన్నాడు. బయట అదేపనిగా జీప్ చప్పుడు.

"మిమ్మల్ని ఎవరో చంపేశారని మాకు ఫోన్ వచ్చింది..."

ఆ విషయం తెల్సుకోవడానికి వచ్చాం అన్నట్లుగా మధ్యలోనే, ఆ వాక్యాన్ని ముగించాడు మరొకడు.

'ఇన్ఫర్‌మేషన్ నిజమైనా, అబద్ధమైనా, రాత్రైనా, పగలైనా, ఎండైనా, వానైనా, చల్లో అయినా డ్యూటీ చెయ్యక తప్పదు కదండీ' అన్నాడు నాలుగోవాడు. వాడు ఈ ముగ్గురి నీడే కనిపించకుండా వున్నాడు. కానైతే వాడు పట్టుకొన్ని తుపాకి మీద వీధిలైట్ పడటంతో దాని నీడ పొడుగ్గా వాకిట్లో పర్చుకొంది. వాడు కనిపించకుండా తుపాకీ నీడ మాత్రమే కనిపించినందువల్లా ఆ తుపాకీయే మాట్లాడుతుందేమోననిపించింది. అయినా మనుషులకైతే ఎండా, వానా, చలి కానీ తుపాకులకే చలి, వేడీ, తడి. అది ఎప్పుడు పడితే అప్పుడు ఎక్కడ పడితే అక్కడ యిలాగే పేల్తుంది.

"అయినా పెళ్ళాం పక్కలో అందరూ వెచ్చగా తొంగునే టైంలో కూడా మాకు డ్యూటీ తప్పదు" అని చికాకు పడ్డాడు మొదటివాడు, సత్యం భార్యకేసి చూస్తూ. ఆమె సిగ్గుతో లోపలికి వెళ్ళిపోయింది. సత్యనారాయణ తప్పు చేసినవాళ్ళా తలొంచుకొన్నాడు. మొట్టమొద టిసారి బ్రతకడం కోసం పోలీసోడనే అసహ్యాన్ని సహించడం ఎలాగుంటుందో అనుభవంలోకి వచ్చిందతనికి. యిహ మీరు వెళ్ళొ చ్చునన్నట్లుగా వాళ్ళ మొహం మీద యాడ్చి కొట్టినట్టుగా తలుపు లేసేశాడు.

ఆ తరువాత ఏమీ మాట్లాడకుండా యింట్లోకి వెళ్ళి, తన మొహా న్ని భార్యకి చూపించడం యిష్టంలేనివాళ్ళా, తన నీడని తాను చూసుకోవడానికి వెరిసినట్టు బెడ్‌లైట్ కూడా తీసేసి ముసుగుతన్ని పడుకొన్నాడు.

ఆ తెల్లవారుజామున పాలు తీసుకోవడానికో పేపర్ తీసుకోవడా నికో ఎందుకు తలుపు తీసాడో తెలవదు, తలుపులు తెరిచున్నాయి. అతను ప్రక్కమీద లేడు. ఇంట్లో లేడు. అదృశ్యమైపోయాడు. ఎక్క డ వెదికినా కనిపించలేదు. ఆ ఉదయం అతన్ని ఎవరూ, ఎక్కడా చూసినట్లు చెప్పలేదు.

మఫ్టీ పోలీసులు అన్న మాటలు అతన్ని బాధపెట్టాయి. అతని భార్యని గాయపర్చాయి. ఆ గాయంతో, బాధతో వాళ్ళిద్దరు ఆ రాత్రి ఒకర్నొకరు చూసుకోలేకపోయారు. వాళ్ళల్లో వాళ్ళే బాధపడ్డారు. ఆ బాధతోటే ఆమెకి ఆ తెల్లారగట్ట నిద్ర పట్టేసింది. ఆ తెల్లవారుజామున అతను కనిపించకుండా పోయేసరికి ఆమె ఎంతో బాధపడింది. "నేనెంతో పాపిష్టిదాన్ని. ఆయన బాధపడుతు న్నా పట్టించుకోలేదు", అనుకొని కుమిలి కుమిలి ఏడ్చింది. ఎవరు

ఉదయం పది గంటలకి ఎవరో ఆమెకి ఫోన్ చేసి చెప్పారు. సత్యాన్ని సెంటర్లో ఎవరో నరికేశారని. గుండెలు బాదుకొంటూ పరిగెట్టిందామె. అతని మెడని ఎవరో భీకరంగా నరికేశారు. తల మొండెం నించి మూడొంతులు తెగిపోయి చూడ్డానికి భీకరంగా ఉంది. మొహం నిండా గాయాలతో అతన్ని చూసినవాళ్ళకి అతని ఒళ్ళంతా గాయంలా కనిపించాడు. యూ టూ బ్రూటస్ అన్నట్లుగా తెరిచిన కళ్ళు తెరిచినట్లుగానే ఉండిపోయాయి.

ఎంత ఓదార్చినా ఆమె సమాధానపడలేకపోయింది.

పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని ఇన్వెస్టిగేషన్ పేరి ట ఆమెని కూడా అనుమానించారు. అతను పని చేసే మానవ హక్కుల సంఘంలో వివాదాలు తట్టుకోలేకే అతను చెప్పా పెట్టకుం డా ఎక్కడికో వెళ్ళిపోయాడనీ తమ పలుకుబడి ఉపయోగించి ఒక పత్రికలో వార్త రాయించారు.

అతన్ని ఏదో చేసి యిలా నాటకమాడుతున్నారని ఎవరెంత గోల చేసినా వాళ్ళు పట్టించుకోలేదు. రోజుకొక శవాన్ని చూపించి "యిది మీ ఆయందో కాదో గుర్తు పట్టు" అనేవారు. ఆ శవాలు కుళ్ళిపోయి కంపు కొడుతున్నవో, సగం కాలి భీకరంగానో ఉండేవి. ఎక్కడ సత్యం శవాన్ని చూడాల్సి వస్తుందోనన్న భయం. ఆ చచ్చిపోయింది సత్యం కాకపోతే బాగుండునన్న ఆశ, ...భయంతో, బాధతో, ఆశ, నిరాశలతో శవాల్ని చూసేది. ఆ శవం సత్యంది కాకపోయేసరికి గుండెల్లో పేరుకొన్న భారాన్ని ఒక్కసారిగా దిగవిడిచినట్లు నిట్టూర్చి వెనుదిరిగేది.

ఏ జన్మలో ఏ పాపం చేశానో, యిప్పుడు యిలాగ అయింది అనుకొనేది.

దిక్కుమాలిన శవం సత్యందైనా, కాకపోయినా అలాగ దిక్కు లేకుండా పడివుండటం చూసి ఆమెకి దుఃఖం వచ్చేది. ఏడుస్తే ఆ శవం సత్యందని ఎక్కడ కన్ఫం చేస్తారోనని భయంతో, ఏమీ మాట్లాడకుండా కాదన్నట్లు తల అడ్డంగా తిప్పి ఇంటికొచ్చి ఏడ్చేది. ఆమెలో ఎక్కడో అణగారిపోతున్న ఆశ లేచి ఒచ్చి ఆమె బాధని మరిపించేది.

అలాంటిది ఆ ఉదయం పది గంటలకి ఎవరో ఆమెకి ఫోన్ చేసి చెప్పారు. సత్యాన్ని సెంటర్లో ఎవరో నరికేశారని. గుండెలు బాదు కొంటూ పరిగెట్టిందామె. అతని మెడని ఎవరో భీకరంగా నరికేశారు. తల మొండెం నించి మూడొంతులు తెగిపోయి చూడ్డానికి భీకరంగా ఉంది. మొహం నిండా గాయాలతో అతన్ని చూసినవాళ్ళకి అతని ఒళ్ళంతా గాయంలా కనిపించాడు. యూ టూ బ్రూటస్ అన్నట్లుగా తెరిచిన కళ్ళు తెరిచినట్లుగానే ఉండిపోయాయి.

కనిపించకుండా పోయిన్నాడు అతను కట్టుకొన్న బట్టలు అతని ఒంటి మీద అలాగే వున్నాయి.

అతన్నీస్థితిలో చూసిన ఆమె దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. అతని శవం మీద పడి బోరుబోరున ఏడ్చింది. గుండెలు బాదుకొంటూ గూండాల్నీ, పోలీసుల్నీ తిట్టింది. తన ఉసురు తగిలి దిక్కు లేకుండా పోతారని శపించింది.

చూస్తుండగానే ఆ నోటా, ఆ నోటా వార్త ఊరంతా పాకింది. టీవీల్లో, రేడియోల్లో ప్రకటించారు.

మానవ హక్కులవాళ్ళూ, సత్యం స్నేహితులు, బంధువులూ అంతా వచ్చారు.

శవం వాళ్ళని భయపెట్టింది. నిలేసింది. ప్రశ్నించింది.

మాట్లాడలేకపోయారు. నోరు పెగలక సమాధానం రానివాళ్ళలా మౌనంగా ఉండిపోయారు. నిశ్శబ్దం శవంలోంచి బైటికి వచ్చి వాళ్ళ ని ఆవహించినట్లు ఉంది.

కాలమే ఆ శవానికైన గాయాల్ని మాన్పుతుందన్నట్లుగా వాళ్ళు వేదాంతికంగా నిట్టూర్చారు.

పోలీసులొచ్చి శవం చుట్టూ మూగినవాళ్ళని "పంచనామా చెయ్యాలి. జరగండి! జరగండి!" అంటూ అదిలించి విదిల్చి పారే శారు.

"నా మొగుణ్ణి మీరే పొట్టన బెట్టుకొన్నారు. ఏ మొహం పెట్టుకొని యిక్కడికొచ్చారు" నిలేసింది సత్యం భార్య.

పొట్ట లోపలికనుకొని "సాక్ష్యం ఏది?" అన్నట్లుగా ఎంతో అమా యకంగా చూశారు వాళ్ళు.

గాయానికి అవమానం తోడైనందుకు ఆమెకి ఆమె మీదా, చుట్టూ ఉన్న మనుషుల మీదా, పోలీసుల మీద అసహ్యమేసింది.

ప్రశ్నించే వాళ్ళకిదే గతి పడుతుందన్నట్లు, అక్కడున్న వాళ్ళంద రికీ యిది హెచ్చరిక అన్నట్లుగా చూశారు పోలీసులు.

అర్ధరాత్రిపూట ఏదో అదృశ్యశక్తి వాళ్ళ ఛాతీ మీద కూర్చుని పీక నులిమేస్తున్నట్లుగా ఉంది. అక్కడ మూగినవాళ్ళందరికీ గొంతులోంచి దుఃఖం కానీ, మాట కానీ పెగల్లేదు. భయం వాళ్ళ రూపాన్ని సంతరించుకొంది.

స్మశానంలో చెట్టుక్రింద అతని భార్య కూర్చుని కుమిలి కుమిలి ఏడుస్తోంది. ఆశ్చర్యపోయాడు సత్యం. ఏమైంది, ఎందుకు తను అలాగ ఏడుస్తోంది? అన్న ప్రశ్నలు అతన్ని వేధించాయి. ఆమె చుట్టూ అతని బంధువులూ, స్నేహితులు ఆమెని ఓదారుస్తున్నారు. "ఏం చేస్తాం. జరగకూడంది జరిగింది. ఏడ్చినా పోయిన మనిషి తిరిగి వస్తాడా? గుండె రాయి చేసుకోవాలి" అంటున్నారు.

"ఎవరు, ఎవరు పోయింది. ఎవరికోసం ఏడుస్తున్నావు" అన్నాడు ఆత్రంగా.

వెర్రిచూపు చూసింది ఆమె.

చచ్చైనా బ్రతికిపోయాడనుకొందో ఏమో ఆమె, ఏమీ మాట్లాడ లేదు. చితిమంటల్లో కలిసిపోయాడతను.

మండుతున్న చితిలోంచి "టప్" మన్న శబ్దం వినిపించింది.

సూర్యుడు చితిమంటల్లో కల్సిపోయాడు.

కపాలం పగిలిందన్నారు, ఎవరో. అంతా వెనక్కి తిరిగారు. వాళ్ళ మౌనంలో అతను కథగా మిగిలిపోయాడు.

కథకున్న శక్తి తెలవని పోలీసులు మౌనంగా ఉన్నవాళ్ళని చూసి అనేక శవాల్ని తగలబెట్టినట్లుగా సంతృప్తి పడ్డారు. •